మరో రెండ్రోజులు వర్షాలు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రాగల రెండ్రోజులు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఆగ్నేయ మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో విదర్భ మీదుగా తెలంగాణ మధ్య ప్రాంతాల వరకు ఉపరితల ఆవర్తనం నుంచి ద్రోణి సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతున్నదని పేర్కొన్నది. ఈ క్రమంలో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. సోమవారం పలు జిల్లాలో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది.

యువ వికాసం దరఖాస్తు తేదీని పొడిగించాలి

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తు తేదీని పొడిగించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటారమేశ్, ఆనగంటి వెంకటేశ్‌లు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరస సెలవులు, సర్వర్ మొరాయింపులతో చాలామంది యువత దరఖాస్తు చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. అలాగే సర్టిఫికెట్ల కోసం మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగినా.. త్వరగా జారీకావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు కుల, ఆదాయ సర్టిఫికెట్లను త్వరగా దరఖాస్తుదారులకు అందించాలని విజ్ఞప్తిచేశారు.

ఉద్యానవన పంటల వైపు మొగ్గుచూపాలి

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రైతులు కేవలం వాణిజ్య పంటలే కాకుండా, ఉద్యాన వన పంటలవైపు మొగ్గుచూపాలని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సూచించారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో జరిగిన తెలంగాణ రైతు మహోత్సవం-2025 వేడుకలకు ఆయన హాజరై మాట్లాడుతూ.. భూసార పరీక్షలు చేసిన తర్వాత, దానికి తగ్గట్టుగా పంటలు సాగు చేపట్టాలని కోరారు. పంటలసాగులో పురుగుమందులు, రసాయనాల వాడకం తగ్గించి.. సేంద్రియ పద్ధతుల్లో దిగుబడులు సాధించాలని అన్నారు. అనంతరం రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

'దళిత్ స్టడీస్'కు కాంగ్రెస్ తాళం!

- బీఆర్ఎస్ హయాంలోనే సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ భవనం పూర్తి
- ప్రారంభించకుండా సర్కార్ నిర్లక్ష్యం
- కేసీఆర్‌కు పేరొస్తుందనే కాంగ్రెస్ కుట్ర
- 25 కోట్లతో దళిత్ స్టడీసెంటర్ నిర్మాణం
- 67 వేల చ.అ., 6 అంతస్థుల్లో భవనం
- ముందు 27 ఫీట్ల అంబేద్కర్ విగ్రహం
- ఢిల్లీ విజ్ఞాన్‌భవన్‌లాగా ఆడిటోరియం
- దళితుల స్టడీ, రీసెర్చ్‌కు దోహదం

బోరబండ మోతీనగర్‌లోని సెంటర్‌ఫర్ దళిత్ స్టడీస్ భవనం

హైదరాబాద్, ఏప్రిల్13 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ పంచిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు దక్కకుండా, కేసీఆర్‌కు పేరు రాకుండా ఉండాలనే కాంగ్రెస్ సర్కార్ కుట్రకు మరో కేంద్రం దర్పణంగా నిలిచింది. కేసీఆర్ హయాంలో నిర్మించిన సీడీఎస్ (సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్) నూతన భవనాన్ని 16 నెలలైనా ప్రారంభించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. దళితుల అభ్యున్నతికి బహుముఖ కృషిచేస్తున్న సీడీఎస్ (సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్) మరింత మెరుగైన పరిశోధనలకు వీలుగా, దళితుల సమగ్ర అభివృద్ధికి ఒక దిక్సూచిలా నిలిచేలా శాశ్వత భవనాన్ని నిర్మించాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాడే సంకల్పించారు. అంబేద్కర్ 125వ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని బోరబండ మోతీనగర్‌లో సీడీఎస్ భవన నిర్మాణానికి 2016లోనే సీఎంగా కేసీఆర్ శ్రీకారం చుట్టారు. 1,499 చదరపు గజాల భూమిని, రూ.25 కోట్లను ఆ భవన నిర్మాణానికి కేసీఆర్ కేటాయించారు. ప్రవేశ ద్వారం వద్ద 27 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుచేశారు. పార్కింగ్ కోసం 2 సెల్లార్లు, స్టిల్ ఫ్లోర్ పార్కింగ్/మల్టిపర్పస్ ఓపెన్ ఏరియాను కేటాయించారు. 2023 జనవరి నాటికే ఆరు అంతస్థుల్లో భవన నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాయి. ఇప్పటికి 16 నెలలు గడిచినా భవన ప్రారంభంపై కాంగ్రెస్ సర్కార్ దృష్టి సారించడమే లేదు. తెలంగాణతోపాటు దేశమంతటా దళితుల సాధికారత కోసం అంకితభావంతో, రాజీలేకుండా సీడీఎస్ సంస్థ చేస్తున్న కృషికి గుర్తింపుగా దీనిని నిర్మించారు. దళితులపై అధ్యయనానికి అత్యంత భారీ మౌలిక సదుపాయాలు కలిగిన భవనం దేశంలో ఇదే మొదటిది కావడం తెలంగాణకు గర్వకారణం. దళిత వర్గాలకు సమాన హక్కులు కల్పించి, వారి నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా 'సమిష్టి సమాజాన్ని' నిర్మించాలనే లక్ష్యంతో 1999లో లాభాపేక్షలేని సంస్థగా సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ (సీడీఎస్) ఏర్పడింది. సామాజిక, ఆర్థిక అడ్డంకులను అధిగమిస్తూ సీడీఎస్ గత 23 ఏండ్లుగా సెమినార్లు, వర్క్‌షాప్‌లు, సమావేశాలు, డాక్యుమెంటరీ చిత్రాలు, మీడియా సెన్సిటైజేషన్, శిక్షణ, కెపాసిటీ బిల్డింగ్, అడ్వకేసీ, లాబీయింగ్‌తో సహా పలు వ్యూహాల ద్వారా దళితవర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత కోసం ప్రయత్నిస్తున్నది. సీడీఎస్ తన ప్రయాణంలో అనేక విజయాలు సాధించింది. అందులో ముఖ్యమైనది, ఎంతో చారిత్రత్మకమైనది ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం-2013. ఈ చట్టం కోసం 13 ఏండ్ల సుదీర్ఘ పోరాటానికి సీడీఎస్ నాయకత్వం వహించింది. అందులో టీఆర్ఎస్, నాటి ఉద్యమ నాయకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ చట్టంలో కీలక పాత్ర పోషించడం విశేషం. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆ చట్టాన్ని మెరుగైన అమలు కోసం 2017లో 'షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టంగా కేసీఆర్ నాడు మార్చారు. కొత్త చట్టం, నియమాలను అమలు చేయడంలో సీడీఎస్‌ను ఒక భాగం చేయడం మరో విశేషం.

కాంగ్రెస్ సర్కారు తీవ్ర జాప్యం

ఆరు అంతస్తుల్లో చేపట్టిన సీడీఎస్ భవన నిర్మాణం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయింది. నామమాత్రపు పనులు మాత్రమే అప్పటికి పెండింగ్‌లో ఉన్నాయి. భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉన్నదని దళిత్ స్టడీ సెంటర్ అధికారులు వెల్లడించారు. స్టడీ సెంటర్ అభివృద్ధికి, నిర్వహణకు కొద్దిమొత్తంలో నిధులను కేటాయిస్తే సరిపోతుంది. భవనం అందుబాటులోకి వస్తే దళితుల సామాజిక జీవనానికి సంబంధించిన అంశాలపై పరిశోధనలు, అధ్యయనాలకు, దళితులకు శిక్షణ కేంద్రంగా కూడా దోహదపడనున్నది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఇప్పటికీ ఈ భవనం ప్రారంభోత్సవంపై దృష్టి సారంచనేలేదు.

సీడీఎస్ కార్యకలాపాలు

- సీడీఎస్ పరిశోధన కోసం ఒక ప్రముఖ బృందాన్ని కలిగి ఉన్నది. ఇది ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారులు, తెలంగాణ, దేశమంతటా దళితుల ప్రస్తుత స్థితి, ఎస్సీ, ఎస్టీలకు బడ్జెట్ కేటాయింపులు, అట్రాసిటీలు, ఏవైనా ఇతర పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది.
- సీడీఎస్ డిజిటల్ క్లాస్ రూమ్‌లతో పోటీ పరీక్షలకు (యూపీఎస్సీ, స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, బ్యాంక్ ఉద్యోగాలు మొదలైనవి) సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు శిక్షణను అందిస్తుంది. సంబంధిత ప్రొఫెషనల్ కోర్సులో పట్టభద్రులైన విద్యార్థులకు ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలతో కూడిన నూతన సాంకేతికతపై శిక్షణ ఇచ్చేలా సెంటర్‌లో తరగతి గదులు, లెక్చర్ హాళ్లు, ట్యూటర్ గదులను సిద్ధం చేశారు.
- నిరుద్యోగ దళిత యువతకు (డ్రాప్ అవుట్స్/హోమ్ మేకర్స్) వివిధ జీవనోపాధి నైపుణ్యాలలో వారి స్వయంఉపాధి సామర్థ్యాలను బలోపేతం చేయడానికి టైలరింగ్, బ్యూటీషియన్, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, కార్పెంటరీ, డ్రైవింగ్ తదితర రంగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఆరు అంతస్థుల్లో సీడీఎస్ భవనం

1వ అంతస్థు: కెఫే టేరియా, వెయిటింగ్ లాంజ్, మల్టిపర్పస్ మీటింగ్ హాలు

2వ అంతస్థు: ఉద్యోగుల కోసం వర్క్‌స్టేషన్, డైరెక్టర్, వైస్ చైర్‌పర్సన్ చాంబర్లు. 2 డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, బోర్డ్‌రూమ్, రౌండ్‌టేబుల్ రూమ్, మెడిటేషన్ హాలు

3వ అంతస్థు: సీడీఎస్ లైబ్రరీలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల బోధన, అభ్యాసం, పరిశోధన కార్యక్రమాలకు మద్దతు ఇచ్చేందుకు, సులభతరం చేయడానికి నూతన వెర్షన్ పుస్తకాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భావజాల పుస్తకాలు, బౌద్ధ సంబంధిత పుస్తకాలు, పరిశోధనా ప్రచురణకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. ప్రింట్ సేకరణలో పుస్తకాలు, మోనోగ్రాఫ్‌లు, పరిశోధనా నివేదికలు, చట్ట నివేదికలు, పీరియాడికల్ బ్యాక్ వాల్యూమ్‌లు మొదలైనవి అందుబాటులో ఉండనున్నాయి. డిజిటల్ లైబ్రరీ అనేది దళితులు, పోటీ పరీక్షలు, బౌద్ధ సంస్కృతికి సంబంధించిన పుస్తకాల డిజిటల్ కాపీలను నిర్వహించడం మరో అదనపు సౌకర్యం. మొత్తంగా లైబ్రరీ, డిజిటల్ లైబ్రరీని 1 లక్ష వాల్యూమ్‌లతో ఏర్పాటు చేయనున్నారు.

4వ అంతస్థు: లెక్చర్ హాల్స్‌లో 120 మంది విద్యార్థులు, డిజిటల్ తరగతి గదులు 60 మంది విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పించారు. 100 పడకల సామర్థ్యంతో 14 షేరింగ్ రూమ్‌లు రెసిడెన్షియల్ విద్యార్థుల కోసం నిర్మించారు. విజిటింగ్ లెక్చరర్లకు, సందర్శకుల కోసం 2 వీఐపీ సూట్ రూమ్‌లు.

5వ అంతస్థు: 300 మంది ప్రేక్షకుల సామర్థ్యం కలిగిన ఆడిటోరియం. ఇది ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లోని ఆడిటోరియం తరహాలో సంస్థాగత కార్యక్రమాల కోసం 300 సీట్ల కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన ఎయిర్ కండిషన్డ్ ఆడిటోరియాన్ని నిర్మించారు. భాగస్వామి సంస్థలు కనీస నిర్వహణ చార్జీలతో ఆడిటోరియాన్ని వినియోగించుకోవచ్చు. దళిత సంస్థలు, భాగస్వామ్య సంస్థలు నిర్వహించే కార్యక్రమాలకు, ఆడిటోరియం మంచి వేదికగా నిలువనుందనడంలో సందేహం లేదు.

6వ అంతస్థు: పురాతన దళితుల చరిత్ర, వారసత్వం, సంస్కృతిని ప్రదర్శించే మొట్టమొదటి దళిత మ్యూజియం ఏర్పాటుచేశారు.

అమీర్‌పేట మున్సిపల్ ప్లేగ్రౌండ్‌లో జరిగిన సిక్కుల పండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి తలసాని తదితరులు

అంబేద్కర్ విగ్రహానికి సర్కారు నివాళులర్పించాలి

- కేసీఆర్‌పై కోపంతో రాజ్యాంగ నిర్మాతను అవమానించడం ఏ మాత్రం సరికాదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులోని 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం నివాళులర్పించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదివారం డిమాండ్ చేశారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు వచ్చి తన క్యాబినెట్ మంత్రులు సహా అంబేద్కర్ స్మృతివనాన్ని సందర్శించాలని, ఆ మహనీయుడికి నివాళులర్పించాలని కోరారు. ఈ 125 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ఏర్పాటు చేయించి, ఆయన స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేసే ప్రయత్నం చేశారని వెల్లడించా రు. కేసీఆర్‌పై కోపం ఉంటే విశ్వమేధావి అయిన అంబేద్కర్‌ను అవమానించడం ఎందుకని ఆమె ప్రశ్నించారు. ప్రపంచ దేశాలు డాక్టర్ అంబేద్కర్‌ను గౌరవిస్తున్నాయని పేర్కొంటూ.. సెక్రటేరియట్ పక్కనే నిర్మించిన ఆయన విగ్రహాన్ని మాత్రం తెలంగాణ ప్రభుత్వం గౌరవించకపోవడం బాధాకరమని వాపోయారు. అంబేద్కర్ రాజ్యాంగంపై ప్రమాణం చేసి.. ఆయన పేరుతో నిర్మించిన సెక్రటేరియట్ కేంద్రంగా పాలన సాగిస్తూ.. కేసీఆర్‌పై అక్కసుతో అంబేద్కర్‌ను గౌరవించకపోవడం అవమానకరమని మండిపడ్డారు. గతేడాది అంబేద్కర్ జయంతికి సీఎంతోపాటు ఏ ఒక్క మంత్రి కూడా.. ఈ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించలేదని దుయ్యబట్టారు. కనీసం ఆ మహనీయుడి విగ్రహానికి ఒక్క పూలమాల కూడా వేయకపోవడం చాలా బాధాకరమని వాపోయారు. ఈ సారి అలాంటి తప్పిదం జరగకుండా సీఎం చొరవ చూపాలని కోరారు. అంబేద్కర్ విగ్రహం, స్మృతి వనం గేట్లు తెరిచి ప్రజలు సందర్శించుకునే అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ కవిత సర్కారును డిమాండ్ చేశారు.

షకీల్ కుటుంబానికి పరామర్శ

బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించింది. ఆదివారం వారి కుటుంబసభ్యులను హైదరాబాద్‌లోని నివాసంలో ఎమ్మెల్సీ కవిత దంపతులు పరామర్శించారు. ఆమె మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పూలే విగ్రహ ఏర్పాటుకు లేఖ రాయండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌కు వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఆవరణలో జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు కోసం ప్రభుత్వానికి లేఖ రాయాలని యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌కు విన్నవించారు. ఈ మేరకు ఆదివారం వారి నివాసాల్లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలకుంట్ల హరి, దూగుంట్ల నరేశ్, ప్రజాపతి, గోపు సదానందం, నరహరి, ప్రవీణ్, కుమారస్వామి, మారయ్య, సాళ్వాచారి తదితరులు ఉన్నారు.

ధృతరాష్ట్రుడిలా జానారెడ్డి

- ధర్మరాజులా ఉండాల్సిన వ్యక్తి.. నా పదవికి అడ్డుపడుతున్నాడు
- ఒక ఇంట్లో ఇద్దరు క్రికెటర్లు ఉన్నట్టే.. ఇద్దరు మంత్రులుంటే తప్పా?
- మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్/చండూర్, ఏప్రిల్ 13: మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు అధిష్ఠానం మంత్రిపదవి ఇస్తానంటుంటే.. సీనియర్‌నేత జానారెడ్డి అడ్డం పడుతున్నారని ఆరోపించారు. ధర్మరాజులా ఉండాల్సిన వ్యక్తి.. ధ్రుతరాష్ట్రుడిలా వ్యవహరిస్తున్నారని తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన నేతలకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని అధిష్ఠానానికి జానారెడ్డి రాసిన లేఖపైనా రాజ్‌గోపాల్‌రెడ్డి మండిపడ్డారు. 30 ఏండ్లు మంత్రి పదవి అనుభవించిన జానారెడ్డికి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రి పదవి ఇవ్వాలనే విషయం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. భువనగిరి ఎంపీ సీటు గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని అధిష్ఠానం చెప్పిందని, చాలా చోట్ల మంత్రులు ఇన్‌చార్జులుగా ఉన్న స్థానాలు కూడా కాంగ్రెస్ ఓడిపోయినా, తాను మాత్రం ఎమ్మెల్యేగా ఉండి, భువనగిరి ఎంపీ సీటు గెలిపించానని చెప్పారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ భారత క్రికెట్ జట్టులో ఒక ఇంట్లో నుంచి ఇద్దరు క్రికెటర్లు ఉన్నట్టే... మంత్రివర్గంలో ఒకే కుటుంబం నుంచి ఇద్దరు మంత్రులుంటే తప్పా? ప్రశ్నించారు. మంత్రి పదవి అడుక్కుంటే వచ్చేది కాదని, కెపాసిటీతో వస్తుందని చెప్పారు. చండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గంలోనూ రాజగోపాల్‌రెడ్డి మంత్రి పదవిపై వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి ఇచ్చే సమయంలో జానారెడ్డి అధిష్ఠానానికి లెటర్ పెట్టడంతో ప్రక్రియ మళ్లీ మొదటకు వచ్చిందని అసంతృప్తి వ్యక్తంచేశారు.

బీఆర్ఎస్ హెచ్చరిక.. సర్కారులో కదలిక

- అధికారంలోకి వచ్చిన నుంచి అంబేద్కర్ విగ్రహం గేట్లకు తాళాలు
- నివాళులర్పించకుండా ఆంక్షలు
- పరిసరాల్లో చెత్త కూడా తీయకుండా నిర్లక్ష్యం
- అంబేద్కర్‌ను అంటరానివాడా? ఎర్రోళ్ల మండిపాటు
- ప్రభుత్వం పట్టించుకోకుంటే తామే గేట్లు తెరిచి పరిసరాలను శుభ్రం చేస్తామని ప్రకటన
- ఎట్టకేలకు దిగొచ్చిన రేవంత్

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ) : 'తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లను లేకుండా చేస్తం' అని ప్రకటించిన రేవంత్ సర్కారు.. హైదరాబాద్ నడిబొడ్డున నెక్లెస్‌రోడ్డులో గత సీఎం ఏర్పాటు చేయించిన 125 అడుగుల భారీ విగ్రహం వద్దకు ఎవరూ వెళ్లకుండా ఆంక్షలు విధించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ విగ్రహం గేట్లకు తాళాలు వేసి కనీసం చెత్తను కూడా తీయకుండా నిర్లక్ష్యం వహించింది. అభిమానులు సైతం ఆ మహనీయుడికి నివాళులు అర్పించకుండా కక్షగట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకాన్ని ఏడాదిన్నరగా నిలదీస్తున్న బీఆర్ఎస్, అంబేద్కర్ జయంతి రోజున కూడా ఆయన విగ్రహానికి నివాళులర్పించకుండా చేయడంపై తీవ్రంగా మండిపడింది. సోమవారం అంబేద్కర్ జయంతి ఉన్న సందర్భంగా 'అంబేద్కర్ విగ్రహం గేట్లను తెరుస్తారా? లేదా? ఇకనైనా ప్రభుత్వం స్పందించకుంటే అంబేద్కర్ వాదులమంతా కలిసి గేట్లు తెరుస్తం.. అక్కడ చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేస్తం' అని బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మేడె రాజీవ్‌సాగర్, మన్నె గోవర్ధన్, ఇంతియాజ్ అహ్మద్, గోసుల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఆదివారం ఉదయం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంబేద్కర్ భారీ విగ్రహంపై రేవంత్ సర్కారు వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

అంబేద్కర్‌ను అంటరానివాడిని చేస్తారా?

ఎర్రోళ్ల మాట్లాడుతూ నిరుడు ఏప్రిల్‌లో ఎన్నికల కోడ్ ఉన్నదన్న సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించలేదని విమర్శించారు. 16 నెలలుగా అంబేద్కర్ విగ్రహానికి తాళాలు ఎందుకు తీయడం లేదని నిలదీశారు. కేసీఆర్ హయాంలో ఎస్సీ, ఎస్టీల కోసం రూ.20 వేల కోట్లు ఖర్చు చేసి 1,024 గురుకులాలు ఏర్పాటుచేసి వారిపై నిబద్ధత చాటుకున్నారని తెలిపారు. అంబేద్కర్ అంటరానితనాన్ని నిర్మూలిస్తే, ఆయన విగ్రహాన్ని ప్రజలు చూడకుండా రేవంత్ సర్కారు ఆయనను అంటరానివాడిగా చేస్తున్నదని మండిపడ్డారు. అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత అని, ఆయనను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక కులానికి అంటగడుతున్నదని విమర్శించారు. కేసీఆర్‌పై కోపం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలె గాని, అంబేద్కర్‌ను అవమానించవద్దని హితవు పలికారు. సచివాలయానికి కేసీఆర్ అంబేద్కర్ పేరు పెట్టడం వల్లే సీఎం రేవంత్‌రెడ్డి అక్కడి నుంచి పాలన చేయడం లేదని, మరి అదే కేసీఆర్ కట్టించిన కమాండ్ కంట్రోల్ నుంచి ఎలా పాలన సాగిస్తున్నారని నిలదీశారు. జిల్లాల్లో కేసీఆర్ కట్టించిన కలెక్టరేట్ల నుంచి పాలన ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. అంబేద్కర్ విగ్రహం గేట్లు తెరిచే విషయంలో కాంగ్రెస్ సర్కారులోని 26 మంది ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు సీఎంను నిలదీయాల్సిన సమయం వచ్చిందని చెప్పారు.

స్పందించిన సర్కారు.. పరిసరాలు శుభ్రం

బీఆర్ఎస్ నేతల హెచ్చరికతో స్పందించిన సర్కారు సాయంత్రానికి గేట్లు తెరిపించి విగ్రహం పరిసరాలను శుభ్రం చేయించింది. గేట్ ముందు ఉన్న నీటిని తొలిగించింది. అధికారులు పారిశుధ్య కార్మికులతో చెత్తను తొలగింపజేశారు. నేడు అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది.

జాబ్ లెస్ క్యాలెండర్!

మొదటిపేజీ తరువాయి...

క్యాలెండర్ పత్తాలేకుండా పోయింది. ఉద్యోగాలు భర్తీచేసే టీజీపీఎస్సీ కూడా 'ఇండెంట్లు ఇవ్వండి మహాప్రభో..' అని అడిగినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. దీంతో ప్రస్తుతం భర్తీ చేయాల్సిన పోస్టులేవీ టీజీపీఎస్సీ చేతిలో లేవు. అసెంబ్లీలో ప్రకటించిన 2024-25 జాబ్ క్యాలెండర్ ఇండెంట్లు టీజీపీఎస్సీకి అందలేదు. ఈ నేపథ్యంలో కొత్తగా 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు భర్తీ చేయాల్సిన ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్‌ను రూపొందించాలని కమిషన్ నిర్ణయించింది. శాఖల వారీగా భర్తీ చేయాల్సిన ఖాళీల వివరాలను 2025 మార్చి 31లోగా సమర్పించాలని ఈ ఏడాది జనవరిలోనే ప్రభుత్వానికి టీజీపీఎస్సీ లేఖ రాసింది. 'ఏడాది కాలంలో భర్తీ చేసే మొత్తం పోస్టుల వివరాలను అందజేయండి. ఏప్రిల్‌లో కసరత్తు పూర్తిచేస్తాం. మే నెల నుంచి వరుసగా నోటిఫికేషన్లు ఇస్తాం. మళ్లీ మార్చి నాటికి ఆయా ఉద్యోగాలన్నింటినీ భర్తీచేస్తాం. మళ్లీ ఏప్రిల్‌లో మరికొన్ని ఖాళీల వివరాలివ్వండి. మళ్లీ మార్చి వచ్చే వరకు ఆయా ఉద్యోగాలను భర్తీచేస్తాం. ఇలాగే క్యాలెండర్‌ను కొనసాగిస్తాం' అంటూ ఆ లేఖలో పేర్కొన్నది. కానీ, సర్కారు నుంచి కనీస స్పందనలేదు.

ఒక్క ఇండెంట్ ఇస్తే ఒట్టు

ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చాలా పెద్ద కసరత్తు. తొలుత ఉద్యోగ ఖాళీల వివరాలను శాఖల వారీగా తేల్చాలి. అవసరమైన మేరకు కొత్త పోస్టులను మంజూరుచేయాలి. వాటికి ఆర్థిక శాఖ ఆమోదం తెలపాలి. ఆయా ఇండెంట్లు టీజీపీఎస్సీకి, ఇతర రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలకు చేరాలి. ఆ తర్వాతే రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు నోటిఫికేషన్లు ఇచ్చే ప్రక్రియను ప్రారంభిస్తాయి. ఇందులో ఎక్కడ ఆలస్యం జరిగినా రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ఒక్క అడుగు కూడా ముందుకు పడదు. అయితే, ఇటీవలి కాలంలో ఏ ఒక్క ప్రభుత్వ శాఖలోనూ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిన దాఖలాలే లేవు.

ఉద్యోగాలు కేసీఆర్‌వి.. క్రెడిట్ కాంగ్రెస్‌ది

16 నెలల్లో 57 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీచేసినట్టు ప్రభుత్వం చెప్తున్నది. వీటిలో కాంగ్రెస్ సర్కారు కొత్తగా భర్తీచేసింది ఆరువేల ఉద్యోగాలే! గ్రూప్-1, డీఎస్సీలు కూడా కేసీఆర్ హయాంలో విడుదలైనవే. పాత వాటిని రద్దుచేసి, కొన్ని పోస్టులను కలిపి విడుదల చేసినవే. కాంగ్రెస్ భర్తీ చేసినట్టు చెప్పుకుంటున్న ఉద్యోగాలన్నీ గతంలో కేసీఆర్ హయాంలో 2022, 2023లో నోటిఫికేషన్లు ఇచ్చినవే. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇచ్చిన ఉద్యోగాలకు నియామకపత్రాలు అందజేసి తామే ఉద్యోగాలిచ్చినట్టు ప్రభుత్వం బిల్డప్ ఇస్తున్నది. జేఎల్ నోటిఫికేషన్ దాదాపు 13 ఏండ్ల తర్వాత కేసీఆర్ సర్కారే విడుదల చేసింది. ఇటీవల ఫలితాలు ప్రకటించిన గ్రూప్-4 సహా పలు పరీక్షలను బీఆర్ఎస్ సర్కారు హయాంలోనే నిర్వహించారు. గ్రూప్-2, గ్రూప్-3 నోటిఫికేషన్లను కూడా బీఆర్ఎస్ సర్కారే విడుదల చేసింది. వాటిలో కొన్ని కోర్టు కేసుల కారణంగా నిలిచిపోగా, ఇటీవల న్యాయస్థానాల్లో చిక్కుముడులు వీడటంతో ఇప్పుడు నియామకపత్రాలిచ్చి తామే ఇచ్చినట్టు కాంగ్రెస్ సర్కారు చెప్పుకుంటున్నది.

ఒక్క నోటిఫికేషన్ ఇవ్వని క్యాలెండర్ ఇదే

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఎంతో అట్టహాసంగా ప్రకటించిన 2024-25 జాబ్ క్యాలెండర్ ప్రకారం ఒక్క నోటిఫికేషన్ కూడా ఇప్పటివరకు విడుదలకాలేదు. ఈ విధంగా ఒక్క నోటికేషన్ కూడా ఇవ్వని జాబ్ క్యాలెండర్‌